క్లుప్తంగా

పాఠశాలలో పారిశుద్ధ్యం



గుంటూరు ఎడ్యుకేషన్ : ప్రభుత్వ మహిళా కళాశాల ఎన్‌ఎస్‌ఎస్‌-1 విభాగ ఆధ్వర్యంలో కేవీపీ కాలనీలో ప్రత్యేక శిబిరం నిర్వహించారు. బుధవారం స్థానిక కేవీసార్టీ నగరపాలక సంస్థ ప్రాథమికోన్నత పాఠశాల ప్రాంగణాన్ని పరిశుభ్రం చేసి, మొక్కలు నాటారు. ఎన్‌ఎస్‌ఎస్‌ కార్యక్రమ నిర్వహణాధికారిణి ఎం. సంతోషకుమారి మాట్లాడారు. మొక్కల సంరక్షణతో కాలుష్య నివారణకు తమవంతు పాత్ర పోషించాలన్నారు. అనంతరం చుట్టుగుంటలోని అమ్మ చారిటబుల్‌ ట్రస్ట్‌ను సందర్శించిన సంతోష్‌ కుమారి, ఎన్‌ఎస్‌ఎస్‌ వలంటీర్లు అక్కడ ఆశ్రయం పొందుతున్న అనాథలు, వృద్ధులకు బస్తాల బియ్యం, కందిపప్పు, బిస్కెట్లు, వస్త్రాలు అందజేశారు.

ట్రెడ్‌మిల్‌ కొనుగోలుకు విరాళం



గుంటూరు మెడికల్‌: గుంటూరు జీజీహెచ్‌ కార్డియాలజీ వైద్య విభాగంలో ట్రెడ్‌మిల్‌ కొనుగోలు చేసేందుకు కేర్‌ డెంటల్‌ కళాశాల చైర్మన్‌ డాక్టర్‌ రసూల్‌ బుధవారం రూ.2.50లక్షల చెక్కును ఆసుపత్రి సూపరింటెండెంట్‌ డాక్టర్‌ ఏకుల కిరణ్‌కుమార్‌కు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్‌ కిరణ్‌కుమార్‌ మాట్లాడుతూ ట్రెడ్‌ మిల్‌ వైద్య పరికరం పరికరం కొనుగోలుకు అవసరమైన మరో రూ.లక్షను కార్డియాలజీ విభాగాధిపతి డాక్టర్‌ నాతాని శ్రీక్రాంత్‌ ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జూనియర్‌ అసిస్టెంట్‌ నాగరాజు పాల్గొన్నారు.

సురక్ష క్యాంప్‌లను ఉపయోగించుకోండి

తెనాలిఅర్బన్‌: జగనన్న ఆరోగ్య సుర క్ష మెడికల్‌ క్యాంప్‌లను అందరు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్‌ ఆరోగ్యాధికారి డాక్టర్‌ కె.హెలెన్‌ నిర్మల పేర్కొన్నా రు. గంగానమ్మపేటలోని చుండూరి వారి సత్రంలో బుధవారం రెండొవ విడత జగనన్న ఆరోగ్య సురక్ష మెడికల్‌ క్యాంప్‌ను నిర్వహించారు. స్పెషలిస్ట్‌ వైద్యులు సేవలు అందించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో వీటిని ఏర్పాటు చేస్తుందన్నారు. ప్రజల వద్దకే వైద్యులను తీసుకువచ్చి సేవలు అందించటం జరుగుతుందని చెప్పారు. డాక్టర్‌ వైఎస్‌ఆర్‌ అర్బన్‌ హెల్త్‌ సెంటర్‌ మెడికల్‌ ఆఫీసర్‌ డాక్టర్‌ మౌనిక కుమార్‌ మాట్లాడుతూ జనరల్‌ ఓపీ 162, గైనకాలజీ -30, అప్తమాలజీ-38, ఆర్థోపెడిక్‌-35 మందికి వైద్య సేవలు అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్‌ కె.లక్ష్మి సౌమ్య, డాక్టర్‌ హృషికేష్‌ పాండే, ఆరోగ్య విస్తరణాధికారి బాలచంద్రమౌళి, పట్టణ మలేరియా సబ్‌ యూనిట్‌ అధికారి ఉమాకాంత్‌, వినోద్‌ కుమార్‌, మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పోలీసులు, సీఐఎస్‌ఎఫ్‌ కవాతు

తెనాలిరూరల్‌: గ్రామాల్లో ఎక్కడా అల్లర్లు జరుగకుండ ప్రతి ఒక్కరు స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకోవాలని రూరల్‌ ఎస్‌ఐ పి. కోటేశ్వరరావు ప్రజలకు సూచించారు. మరికొద్ది రోజుల్లో సార్వత్రిక ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో మండలంలోని నందివెలుగు, కొలకలూరు, బుర్రిపాలెం గ్రామాల్లో రూరల్‌ పోలీస్‌ సిబ్బంది అలాగే సీఐఎస్‌ఎఫ్‌ బలగాలు కలిసి బుధవారం సంయుక్తంగా రూట్‌ మార్చ్‌ చేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ గ్రామస్తులనుద్దేశించి మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలందరూ ధైర్యంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. ప్రజలు ఎన్నికల్లో తమ ఓటుని సద్వినియో గం చేసుకునేందుకు ఎలాంటి భయాందోళనకు లోనుకాకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా పోలీసులు మీ వెంటే ఉంటుందన్న నమ్మకాన్ని ప్రజల్లో కల్పించేందుకు పోలీస్‌ రూట్‌ మార్చ్‌ చేసినట్లు తెలిపారు. అలానే వన్‌టౌన్‌ పోలీసులు నాజరుపేటలో మంగళవారం రాత్రి రూట్‌ మార్చ్‌ నిర్వహించారు.

శాంతి భద్రతలకు విఘాతం.. ఉపేక్షించేది లేదు

తాడికొండ: శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించేది లేదని తుళ్ళూరు డీఎస్పీ అశోక్‌ గౌడ్‌ హెచ్చరించారు. మండలంలోని డీఎస్పీ కార్యాలయంలో బుధవారం సాయంత్రం రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్‌ నిర్వహించారు. వివాదాస్పద ఘటనల్లో పాల్గొన్నట్లు తెలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సాధారణ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ప్రజలు నిర్భయంగా తమ ఓటు హక్కును స్వేచ్ఛగా ఉపయోగించుకునేందుకు కేంద్ర బలగాల సహకారంతో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామన్నారు. అలజడులు, దాడులకు ప్రేరేపించే వ్యక్తులపై ప్రత్యేక నిఘా ఉంటుందని తెలిపారు.

అధికారాన్ని బాధ్యతగా స్వీకరించాం

- ఇకపై కూడా అలానే ఉందాం
- ప్రజలతో మమేకం అవుదాం
- గుంటూరు పశ్చిమలో వైఎస్సార్‌ సీపీ విజయం తథ్యం
- రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి రజిని

పట్నంబజారు: అధికారాన్ని బాధ్యతగా భావించి పనిచేస్తున్నామని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని తెలిపారు. గుంటూరు చంద్రమౌళి నగర్‌లోని వైఎస్సార్‌ కాంగ్రెస్‌ పార్టీ కార్యాలయంలో బుధవారం సచివాలయాల కన్వీనర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి విడదల రజిని మాట్లాడుతూ ఇప్పటి వరకు ఎంత బాధ్యతతో ప్రజల కోసం పనిచేశామో.. అంతే బాధ్యతతో ఇకపై కూడా పనిచేయాల్సిన అవసరం ఉందని చెప్పారు. ప్రజలతో మమేకం అయితేనే వారి సమస్యలు తెలుస్తాయని, ప్రజల సమస్యలు తెలుసుకుని తీర్చడంలో సచివాలయాల కన్వీనర్లే కీలక పాత్ర పోషించగలరన్నారు. గత ఎన్నికలకు మించిన గొప్ప విజయాన్ని ఈ సారి మళ్లీ వైఎస్సార్‌ సీపీకి అందజేసేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. త్వరలో జరగనున్న ఎన్నికల సమరంలో ప్రతి ఒక్క సచివాలయ కన్వీనర్‌ ఒక సైనికుడిలా పనిచేసి పార్టీని గెలిపించాలని పిలుపునిచ్చారు. వైఎస్సార్‌ కాంగ్రెస్‌ పార్టీలో నేటి కార్యకర్తలే రేపటి నాయకులని, చిత్తశుద్ధితో, అంకితభావంతో పని చేసే నాయకులకు ఎప్పుడూ తగిన గుర్తింపు ఉంటుందన్నారు. సామాన్య కార్యకర్తలను ఎమ్మెల్యేలుగా, ఎంపీలుగా నిలబెట్టి గెలిపించుకున్న చరిత్ర మన నాయకుడు, రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌ మోహన్‌రెడ్డిదని తెలిపారు. ఇప్పుడు జరగబోయే ఎన్నికలలో కూడా కొందరు సామాన్య కార్యకర్తలకు ఎమ్మెల్యే టికెట్లు ఇచ్చిన విషయం తెలిసిందేనని మంత్రి గుర్తుచేశారు. రానున్న ఎన్నికలు పేదలకు, పెత్తందారులకు మధ్య జరిగే యుద్ధమని, పేదల పక్షాన పనిచేస్తున్న జగనన్నను ఓడించడానికి పెత్తందారీ పార్టీల నాయకులంతా ఏకమై కూటమి కట్టారని పేర్కొన్నారు. ఈ విషయాన్ని సచివాలయాల పరిధిలో ప్రతి ఒక్క ఓటరుకు అర్థమయ్యేలా వివరించాలన్నారు. ఎన్నికల ప్రక్రియ ముగిసేవరకు ప్రతి ఒక్కరూ పార్టీ కోసం అంకితభావంతో పనిచేయాలని కోరారు. సచివాలయ వ్యవస్థ రాకమునుపు గత ప్రభుత్వ హయాంలో ఏ చిన్న పని కావాలన్నా ప్రజలు ఎన్ని అవస్థలు పడేవారో వారికి గుర్తు చేస్తూ, జగనన్న సచివాలయ వ్యవస్థ తీసుకువచ్చాక ప్రజలకు కలుగుతున్న ప్రయోజనాలను వివరించాలని కోరారు. ఇంత గొప్ప వ్యవస్థ గాడి తప్పకుండా సక్రమంగా అమలు జరిపే గురుతర బాధ్యత జగనన్న మీ భుజస్కంధాలపై మోపారని అన్నారు. పార్టీ పశ్చిమ నియోజకవర్గ పరిశీలకుడు రాతంశెట్టి రామాంజనేయులు (లాలుపురం రాము) మాట్లాడుతూ పార్టీ గెలుపులో సచివాలయాల కన్వీనర్లదే కీలకపాత్ర అని చెప్పారు. గుంటూరు నగర పాలక సంస్థ డిప్యూటీ మేయర్‌ వనమా బాలవజ్ర బాబు మాట్లాడుతూ గుంటూరు పశ్చిమలో విడదల రజిని గెలిస్తే.. నియోజకవర్గంలోని పేదలంతా గెలిచినట్లేనని పేర్కొన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిధిలోని కార్పొరేటర్లు, డివిజన్‌ ఇన్‌చార్జిలు, పార్టీ నాయకులు, వివిధ అనుబంధ సంఘాల నాయకులు, సచివాలయాల కన్వీనర్లు పాల్గొన్నారు.

రోడ్డుకు శంకుస్థాపన

పట్నంబజారు: చెప్పిన మాట చెప్పినట్లుగానే ఇచ్చిన మాట నిలబెట్టుకుంటూ సాయిబాబా – సీతయ్య డొంకరోడ్డు నిర్మాణ పనులను ప్రారంభిస్తున్నామని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని చెప్పారు. విద్యానగర్‌లోని సీతయ్య డొంక రోడ్డు నిర్మాణానికి సంబంధించి బుధవారం శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా మంత్రి విడదల రజిని మాట్లాడుతూ వారం రోజుల క్రితం విద్యానగర్‌లో పలు అభివృద్ధి పనులకు సంబంధించి ప్రారంభోత్సవానికి హాజరైన నేపథ్యంలో సీతయ్య డొంక రోడ్డు నిర్మాణం గురించి తన దృష్టికి తీసుకొచ్చారని తెలిపారు. దీర్ఘకాలంగా రహదారి నిర్మాణం గురించి ఎవరూ పట్టించుకోలేదని, తాను ఈరోడ్డు నిర్మాణానికి వెంటనే శంకుస్థాపన చేస్తామని మాట ఇచ్చామని, ఆమాట నిలబెట్టుకుంటూ ఈరోజు రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ డివిజన్‌ ఇన్‌చార్జి సతీష్‌ రెడ్డి పాల్గొన్నారు.

బాబు జగ్జీవన్‌రామ్‌ సేవలు అమోఘం

- వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని
- బాబు జగ్జీవన్‌రామ్‌ కమ్యూనిటీ హాల్‌ నిర్మాణానికి శంకుస్థాపన



శంకుస్థాపన కార్యక్రమంలో మంత్రి విడదల రజిని

నెహ్రూనగర్‌: స్వాతంత్య్ర సమరయోధుడిగా, సంఘ సంస్కర్తగా, రాజకీయవేత్తగా బాబు జగ్జీవన్‌ రామ్‌ సేవలు అమోఘమని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని పేర్కొన్నారు. బుధవారం పశ్చిమ నియోజకవర్గంలోని 44వ డివిజన్‌ గౌతమి నగర్‌ ఎస్సీ కాలనీలో బాబు జగ్జీవన్‌రామ్‌ కమ్యూనిటీ హాల్‌ నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం నిరంతరం పాటుపడిన మహనీయుడు జగ్జీవన్‌రామ్‌ అని కొనియాడారు. ఆయన పేరుతో కమ్యూనిటీ హాల్‌ ఏర్పాటు చేసుకోవడం అభినందనీయమన్నారు. పశ్చిమ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్‌ మాట్లాడుతూ కేంద్రంలో వివిధ శాఖల మంత్రి పదవుల బాధ్యతలు చేపట్టి వాటికి వన్నె తెచ్చిన మహనీయుడు జగ్జీవన్‌ రామ్‌ అని శ్లాఘించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్‌ వనమా బాలవజ్రబాబు(డైమండ్‌బాబు), స్థానిక డివిజన్‌ కార్పొరేటర్‌ వంగల హేమలతరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు వంగల వలివీరారెడ్డి, బాబు కమిటీ అధ్యక్షులు పల్లె జయపాల్‌, ఉపాధ్యక్షులు డాక్టర్‌ లింగాల శ్యామ్‌, సభ్యులు పల్లె కిరణ్‌, ఎస్‌ అనిల్‌, జీ సత్యానందం, కె మరియదాసు, సీహెచ్‌ సాంబశివరావు, కె.అశోక్‌, కె.సాగర్‌, కె.లక్ష్మణ్‌, ప్రసాద్‌ పాల్గొన్నారు.

2047 నాటికి 30 లక్షలకు పైగా సీఏల అవసరం

మాస్టర్‌మైండ్స్‌ అడ్మిన్‌ అడ్వైజర్‌ మట్టుపల్లి మోహన్‌




మోహన్‌, మాస్టర్‌మైండ్స్‌

గుంటూరు ఎడ్యుకేషన్‌: భారతదేశంలో 2047 నాటికి కొత్తగా 30 లక్షల మందికి పైగా చార్టర్డ్‌ అకౌంటెంట్లు అవసరం కానున్నారని మాస్టర్‌ మైండ్స్‌ అడ్మిన్‌ అడ్వైజర్‌ మట్టుపల్లి మోహన్‌ పేర్కొన్నారు. బుధవారం బ్రాడీ పేటలోని సదరు సంస్థ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇన్‌స్టిట్యూట్‌ ఆఫ్‌ చార్టర్డ్‌ అకౌంటెంట్స్‌ ఆఫ్‌ ఇండియా (ఐసీఏఐ) నూతన అధ్యక్షుడిగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన రంజిత్‌ కుమార్‌ అగర్వాల్‌ దేశంలో సీఏలకు పెరిగిన ప్రాధాన్యత, ఆర్థిక రంగంలో వారి ప్రాముఖ్యతను చాటుతూ పలు గణాంకాలను వివరించారని పేర్కొన్నారు. ప్రస్తుతం ఐసీఏఐకు నాలుగు లక్షల మంది సీఏలు సభ్యులుగా నమోదు చేసుకున్నారని తెలిపారు. దేశవ్యాప్తంగా 500లకు పైగా పాఠశాలలు, కళాశాలలతో ఒప్పందం కుదుర్చుకున్న ఐసీఏఐ, ఆయా విద్యా సంస్థల్లో సీఏ కోర్సుల బోధనకు అధ్యాపకులను నియమించి, సొంతంగా సీఏలను తయారు చేసే భారీ ప్రణాళికతో ముందుకు వెళుతున్నట్లు రంజిత్‌కుమార్‌ అగర్వాల్‌ చెప్పారని పేర్కొన్నారు. గతేడాది విద్యార్థులను సీఏ కోర్సుల వైపు మళ్లించడంలో ఐసీఏఐ పురోగతి సాధించిందని, 2023లో కొత్తగా అర్హత సాధించిన 22వేల మంది చార్టర్డ్‌ అకౌంటెంట్లలో 138 మంది కంపెనీలు ఆఫర్‌ చేసిన క్యాంపస్‌ ఇంటర్వ్యూల్లో తొమ్మిది వేలకు విద్యార్థులు ఉద్యోగాలను పొందారని చెప్పారు. సీఏ కోర్సుల్లో విద్యార్థులకు ప్రోత్సాహాన్ని ఇచ్చేందుకు పలు రాష్ట్రాల్లో రాయితీలు ఇస్తున్నట్లు చెప్పారు.

మూత్రపిండానికి గండం

ఆధునిక జీవనశైలితో నేడు కిడ్నీ (మూత్రపిండం) వ్యాధుల బాధితుల సంఖ్య రోజురోజుకూ పెరిగిపోతోంది. చిన్నాపెద్దా తేడా లేకుండా పలువురు బారిన పడుతున్నారు. మగవారితో పోల్చితే ఆడవారిలోనే ఎక్కువగా ఉంటున్నాయి. శారీరక శ్రమ తగ్గిపోవడం, ఒత్తిడితో జీవన విధానం, బీపీ, షుగర్‌ వ్యాధులు నియంత్రణలో లేకపోవడం వల్ల కిడ్నీ వ్యాధులు పెరుగుతున్నాయని వైద్య నిపుణులు తెలియజేస్తున్నారు. ప్రజలకు అవగాహన కల్పించేందుకు వరల్డ్‌ కిడ్నీ డేని ప్రతి ఏడాది మార్చి రెండో గురువారం నిర్వహిస్తున్నారు. ఈనెల 14న వరల్డ్‌ కిడ్నీ డే సందర్భంగా ‘సాక్షి ’అందిస్తున్న ప్రత్యేక కథనం. –గుంటూరు మెడికల్‌

- ఆధునిక జీవనశైలితో పెరుగుతున్న వ్యాధి బాధితులు
- అప్రమత్తంగా ఉండాలంటున్న వైద్యులు
- అందుబాటులో ఆధునిక వైద్యసేవలు
- నేడు వరల్డ్‌ కిడ్నీ డే



కిడ్నీ డే పోస్టర్‌



జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న కిడ్నీ రోగులు(ఫైల్‌)

అధిక సంఖ్యలో బాధితులు

జిల్లాలో 15 మంది కిడ్నీ వైద్య నిపుణులున్నారు. వీరి వద్దకు ప్రతిరోజూ 300 నుంచి 400 మంది బాధితులు చికిత్స కోసం వస్తున్నారు. గుంటూరు జీజీహెచ్‌ నెఫ్రాలజీ ఓపీ వైద్య విభాగంలో 2021లో 694 మంది, 2022లో 1269 మంది, 2023లో 1507, 2024 జనవరి, ఫిబ్రవరిల్లో 404 మంది చికిత్స పొందారు.

వ్యాధి లక్షణాలు

- కిడ్నీ వ్యాధి సోకినవారిలో ముఖం, కాళ్ల వాపులు కనిపిస్తాయి
- ఆయాసం, అలసటగా ఉంటుంది
- పనిమీద ఏకాగ్రత తగ్గడంతో పాటు ఆకలి మందగిస్తుంది
- రాత్రి వేళల్లో మూత్రం ఎక్కువసార్లు రావడం
- కొన్ని సందర్భాల్లో సరిగా రాకపోవడం
- మూత్రంతో పాటు రక్తం
- పోసేటప్పుడు చురకు, మంట

రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

కిడ్నీ వ్యాధిని ప్రాథమిక దశలోనే గుర్తించేలా ముఖ్యమంత్రి వైఎస్‌. జగన్‌మోహన్‌రెడ్డి సీఎంగా బాధ్యతలు స్వీకరించాక గతంలో ఎన్నడూ లేని విధంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. అందులో భాగంగా కిడ్నీలు పాడయ్యేందుకు కారణమయ్యే బీపీ, షుగర్‌లను ప్రాథమిక దశలోనే గుర్తించి చికిత్స చేసేలా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ఇళ్ల వద్దే వైద్య సిబ్బంది ఉచితంగా పరీక్షలు చేస్తున్నారు. వ్యాధి బాధితులకు మందులు కూడా ఇళ్ల వద్దే ఉచితంగా అందిస్తున్నారు. పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో, పీహెచ్‌సీల్లో కూడా స్పెషాలిటీ వైద్యుల్ని ప్రభుత్వం నియమించింది. వీరు కిడ్నీ జబ్బుల్ని ప్రాథమిక దశలోనే గుర్తించి చికిత్స చేస్తున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రభుత్వం డయాలసిస్‌ బాధితులకు ప్రతి నెలా ప్రభుత్వం రూ.10వేల పెన్షన్‌ అందిస్తోంది. కిడ్నీ జబ్బులతో బాధపడుతున్నవారికి ప్రతినెలా రూ. 5వేలు అందజేస్తోంది.

వ్యాధి బారిన పడకుండా జాగ్రత్త అవసరం



క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలి. రక్తంలో చక్కెర శాతాన్ని , అధిక రక్తపోటును నియంత్రణలో ఉంచుకోవాలి.ఆరోగ్యకరమైన ఆహారనియమాలు పాటించాలి. అధిక బరువును తగ్గించుకోవాలి. డాక్టర్‌ పర్యవేక్షణ లేకుండా ఇష్టం వచ్చినరీతిలో మందులు వాడకూడదు. పొగ, మద్యం తాగడం తదితర దురలవాట్లకు దూరంగా ఉండాలి. పరిమిత ఆహారంతో పాటు ఉప్పు తగ్గించి వాడాలి. నీరు ఎక్కువగా తాగాలి.

– మారెడ్డి శ్రీనివాసరెడ్డి, నెఫ్రాలజిస్ట్‌, గుంటూరు

అందుబాటులో ఆధునిక వైద్యసేవలు



కిడ్నీ వ్యాధి బారిన పడిన వారిని ముందస్తుగా గుర్తించి చికిత్స చేయడం ద్వారా ప్రాథమిక దశలోనే కట్టడి చేయవచ్చు. ముఖ్యంగా షుగర్‌ వ్యాధి బాధితులకు ఆధునిక మందులు, వైద్య చికిత్సలు అందుబాటులోకి వచ్చాయి. ఆధునిక వైద్య పద్ధతుల ద్వారా డయాలసిస్‌ చేయించే ప నిలేకుండానే వ్యాధిని కట్టడి చేయవచ్చు. డయాలసిస్‌ చేయించుకునేవారికి కిడ్నీ మార్పిడి ఆపరేషన్‌ చేస్తే ఎంతో ఉపయోగంగా ఉండి జీవిత కాలం 20 ఏళ్లవరకు పొడిగించవచ్చు.

– డాక్టర్‌ అన్నపురెడ్డి శివనాగేంద్రరెడ్డి, నెఫ్రాలజిస్ట్‌, గుంటూరు

ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా ఆపరేషన్లు



జీజీహెచ్‌లో ప్రతిరోజూ కిడ్నీ సంబంధిత సమస్యలతో బాధపడుతూ చికిత్స కోసం వచ్చేవారి సంఖ్య వారంలో 100 నుంచి 150 మంది వరకు ఉంటోంది. వీరే కాకుండా ప్రతి రోజూ 50 మందికి పైగా డయాలసిస్‌ చేయించుకుంటున్నారు. ఆస్పత్రిలో 24 గంటలూ డయాలసిస్‌ వైద్యసేవలు జరుగుతూనే ఉంటాయి. డాక్టర్‌ వైస్సార్‌ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా 24 మందికి ఉచితంగా జీజీహెచ్‌లో కిడ్నీ మార్పిడి ఆపరేషన్లు చేస్తున్నాం.

– డాక్టర్‌ గొంది శివరామకృష్ణ, జీజీహెచ్‌ నెఫ్రాలజీ విభాగాధిపతి, గుంటూరు

మోదీ పాలనలో రైతులకు అన్యాయం

పాత గుంటూరు: భారతదేశ ప్రధాని నరేంద్ర మోడీ పాలనలో రైతులకు అన్యాయం జరుగుతుందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ విమర్శించారు. బుధవారం కొత్తపేటలోని మల్లయ్య లింగం భవనంలో సీపీఐ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో రామకృష్ణ మాట్లాడుతూ డాక్టర్‌ ఎంఎస్‌ స్వామినాథన్‌ సిఫార్సుల మేరకు పంటకు మద్దతు ధరల్లో వారి ఉత్పత్తి ఖర్చుకు 50 శాతం జోడించి ఇవ్వాలని, అలాగే దేశ వ్యాప్తంగా ఉన్న రైతుల వంట రుణాలు మాఫీ చేయాలని డిమాండ్‌ చేస్తూ మన రాష్ట్రంలోని రైతు సంఘాలు నిరసనకు దిగనున్నాయని చెప్పారు. రైతు సంఘాలు చేపట్టే నిరసన కార్యక్రమానికి సీపీఐ సంపూర్ణ మద్దతు తెలియజేస్తోందన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు, జిల్లా కార్యదర్శి జంగాల అజయకుమార్‌, నగర కార్యదర్శి కోట మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.

ఐసీయూలో అన్నిరకాల వైద్య పరీక్షలు

గుంటూరు మెడికల్‌: గుంటూరు జీజీహెచ్‌లో నూతనంగా నిర్మించిన ఐసీయూలో రోగులకు అవసరమైన అన్ని రకాల వైద్య పరీక్షలు అందుబాటులో ఉంచుతామని ఆసుపత్రి సూపరింటెండెంట్‌ డాక్టర్‌ ఏకుల కిరణ్‌కుమార్‌ తెలిపారు. బుధవారం ఐసీయూ విభాగాన్ని ఆయన తనిఖీ చేశారు. పలు వ్యాధి నిర్ధారణ పరీక్షల కోసం రోగులను వారి సహాయకులు వ్యాధి నిర్ధారణ పరీక్షలు ఉండే గదుల వద్దకు తీసుకెళ్లడం గమనించారు. ఈ సందర్భంగా ఆయన స్పందిస్తూ.. వైద్య పరీక్షలన్నీ ఐసీయూలోనే అందుబాటులో ఉండేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఈసీజీ వైద్య పరికరం ప్రత్యేకంగా ఐసీయూలో ఏర్పాటు చేస్తున్నాని చెప్పారు. ఈ కార్యక్రమంలో సివిల్‌ సర్జన్‌ ఆర్‌ఎంఓ డాక్టర్‌ బత్తుల వెంకట సతీష్‌కుమార్‌, నర్సింగ్‌ సూపరింటెండెంట్‌ కె.ఆశ సజని, అడ్మినిస్ట్రేటర్‌ బి.ప్రవీణ్‌కుమార్‌ పాల్గొన్నారు.

వృద్ధాశ్రమానికి రూ.25 వేల వితరణ

తెనాలి: పట్టణానికి చెందిన ఏఎస్‌ఎన్‌ డిగ్రీ కాలేజి ప్రిన్సిపాల్‌, మానవత స్వచ్ఛంద సంస్థ చైర్మన్‌ డాక్టర్‌ కొలసాని రామ్‌చంద్‌ ఇక్కడి శ్రీమహాత్మా సేవాశాంతి ఆశ్రమానికి రూ.25 వేల విరాళాన్ని అందజేశారు.

ప్రతి రోజూ మహిళలకు క్యాన్సర్‌ నిర్ధారణ పరీక్షలు

జీజీహెచ్‌ సూపరింటెండెంట్‌ డాక్టర్‌ ఏకుల కిరణ్‌ కుమార్‌



వైద్యులు, సిబ్బందికి ప్రశంసా పత్రాలు అందజేస్తున్న డాక్టర్‌ కిరణ్‌కుమార్‌

గుంటూరు మెడికల్‌: ప్రభుత్వ ఆసుపత్రి నాట్కో సెంటర్‌లో ప్రతి రోజూ మహిళా ఉద్యోగులతో పాటు సాధారణ మహిళలకు క్యాన్సర్‌ నిర్ధారణ పరీక్షలు నిర్వహించనున్నట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్‌ డాక్టర్‌ ఏకుల కిరణ్‌ కుమార్‌ తెలిపారు. బుధవారం ప్రభుత్వ ఆసుపత్రి నాట్కో సెంటర్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళా ఉద్యోగులకు క్యాన్సర్‌ నిర్ధారణ పరీక్షలు చేసి, వైద్యం అందించిన క్యాన్సర్‌ విభాగం వైద్యులకు, సిబ్బందికి ప్రశంసా పత్రాలను అందజేశారు. డీఎంఈ ఆదేశాల మేరకు ఈ నెల 1 నుంచి 8వ తేదీ వరకు సుమారు 300 మంది మహిళా ఉద్యోగులకు స్క్రీనింగ్‌ పరీక్షలు చేసినట్లు వెల్లడించారు. ఈ పరీక్షల్లో అనుమానం ఉన్న ఉద్యోగులకు కూడా నిర్ధారణ పరీక్షలు చేశామన్నారు. రాబోయే రోజుల్లో ప్రివెంటివ్‌ ఆంకాలజి విభాగాన్ని బలోపేతం చేస్తున్నామని తెలిపారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని దత్తత తీసుకున్న మండలాల్లో ప్రతి నెల క్యాన్సర్‌ స్క్రీనింగ్‌ క్యాంపులు కూడా నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో క్యాన్సర్‌ వైద్య నిపుణులు డాక్టర్‌ దుర్గ ప్రసాద్‌, డాక్టర్‌ పి.వి.శివరామకృష్ణ, డాక్టర్‌ జాహ్నవి, డాక్టర్‌ అరుణ, డాక్టర్‌ ఉమా, పీజీ వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

వైద్య రంగంలో ల్యాబ్‌ టెక్నీషియన్ల పాత్ర వెలకట్టలేనిది



కె.బాలకృష్ణ, ఎ.బలవాణిలను సన్మానిస్తున్న అసోసియేషన్‌ నాయకులు

గుంటూరు మెడికల్‌: వ్యాధి నిర్ధారణలో ల్యాబ్‌ టెక్నీషియన్లు కీలక పాత్ర వహించి, వైద్యం సక్రమంగా అందేలా వారికి నివేదికల ద్వారా తోడ్పాటు అందిస్తున్నారని గుంటూరు జిల్లా ల్యాబ్‌ అండ్‌ ఎక్సరే ఓనర్స్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడు ఆనం సంజీవరెడ్డి అన్నారు. బుధవారం ప్రపంచ ల్యాబ్‌ టెక్నీషియన్‌ డే ను పురస్కరించుకొని స్థానిక లక్ష్మీపురంలోని అసోసియేషన్‌ జిల్లా కార్యాలయంలో ఆదర్శ ల్యాబ్‌ టెక్నీషియన్లకు సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. సభకు అధ్యక్షత వహించిన ఆనం సంజీవరెడ్డి మాట్లాడుతూ నగరంలో 50 ఏళ్లుగా ఈ రంగంలో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ వైద్య వృత్తిలో చాలామంది టెక్నీషియన్‌లకు శిక్షణ ఇచ్చారన్నారు. అలాంటి మహోన్నత వ్యక్తులలో ముఖ్యమైన భారతి ఎక్సరే యజమాని కె.బాలకృష్ణ, బాల సుధా డయాగ్నస్టిక్స్‌ సెంటర్‌ యజమాని ఆనం బాలవాణిలను అసోసియేషన్‌ ఆధ్వర్యంలో సభ్యులు ఘనంగా సన్మానించారు. ఐరా ల్యాబ్‌ అధినేత తాడే కోరు శ్రీహరి బాబు మాట్లాడుతూ సాంకేతికతో ఎప్పటికప్పుడు వైద్యులకు, ప్రజలకు అందించే సేవలు వెల కట్టలేనివన్నారు. కార్యక్రమంలో సిటీ అసోసియేషన్‌ అధ్యక్షుడు ఎం.వెంకటలక్ష్మణ్‌, కార్యదర్శి శ్రీనివాసరావు, కోశాధికారి ఎస్‌.వెంకట రమణారావు, సహాయ కార్యదర్శి కే. బాలు, సభ్యులు మస్తాన్‌, నాగరాజు, సురేష్‌, బాబ్జి, కృష్ణ పాల్గొన్నారు

చెట్టును ఢీకొన్న వ్యాను.. వ్యాపారి మృతి



మృతదేహాన్ని బయటకు తీయిస్తున్న ఎస్‌ఐ

ఫిరంగిపురం: ప్రమాదవశాత్తు చెట్టును మినీ వ్యాను ఢీకొని ఒకరు మృతి చెందిన ఘటన మండలంలోని వేములూరిపాడు గ్రామ శివారులో బుధవారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం విజయవాడకు చెందిన చుట్టల వ్యాపారి మహ్మద్‌ రియాజ్‌ బాష (46) వ్యాపారం నిమిత్తం వినుకొండ ప్రాంతానికి వెళ్లి.. తిరిగి వస్తున్నాడు. మండలంలోని వేములూరిపాడు గ్రామ శివారు వద్దకు రాగానే ప్రమాదవ శాత్తు వ్యాను అదుపు తప్పి చెట్టును ఢీకొంది. దీంతో రియాజ్‌ బాష అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న ఎస్‌ఐ వీరనారాయణ ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు నమోదు చేసుకున్నారు. వ్యాన్‌లోని మృతదేహాన్ని బయటకు తీయించి, జీజీహెచ్‌ మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య, పిల్లలు ఉన్నారు.

అర్చక శిక్షణ పరీక్షకు దరఖాస్తుల ఆహ్వానం

తాడేపల్లిరూరల్‌ : ఆంధ్రప్రదేశ్‌ ప్రభుత్వం దేవదాయ ధర్మదాయ శాఖ ఆధ్వర్యంలో అర్చక ట్రైనింగ్‌ అకాడమీ అర్చక పరీక్షలను నిర్వహించనున్నట్లు అకాడమీ ప్రతినిధులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మార్చి 30 నుంచి ఏప్రిల్‌ 30వ తేదీ వరకు ఆన్‌లైన్‌ ద్వారా పరీక్షలకు అప్లికేషన్లు స్వీకరిస్తామని, మే 10 వరకు ఆలస్య రుసుముతో అప్లికేషన్లు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఏప్రిల్‌ 30వ తేదీ లోపు అభ్యర్థుల అన్ని వివరాలు స్క్రూటినీ చేయడం జరుగుతుందని తెలిపారు. జులై 13, 14వ తేదీలలో పరీక్షలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అర్చక ట్రైనింగ్‌ అకాడమి యూ ట్యూబ్‌ చానల్‌ ద్వారా అర్చక పరీక్షల సంస్కృత పాఠ్యాంశాలు బోధించేందుకు నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.